# పసిహృదయం

"రోహిణీ! త్వరగా రామ్మా నీకు నీళ్ళుపోసి, నేనూ స్నానం చెయ్యాలి" వేన్నీళ్ళు బక్కెట్లో పోస్తూ పిలిచింది లక్ష్మి.

పూసలతో ఆడుకుంటున్న ఎనిమిదేళ్ళ రోహిణి లక్ష్మి మాటలు పట్టించుకోలేదు.

"వస్తున్నావా రోహిణి" మళ్ళీ పిలిచింది.

ఇక వెళ్ళకపోతే అమ్మ నోట్లోనుంచి ఎలాంటి మాటలొస్తాయో తెలిసిన రోహిణి లేచి చరచరా స్నానికి వెళ్ళింది.

గౌను విప్పిన అమ్మ నిర్ఘాంతపోయింది. వీపంతా ఎర్రగా వాతలున్నాయి. బెత్తం చారలు స్పష్టంగా కన్పిస్తున్నాయి.

అమ్మ వాటిని చూస్తున్నదని తెలిసికూడా ఏమీ ఎరగనట్టు నిల్చుంది రోహిణి.

"ఏమిటే ఈ దెబ్బలు. ఎవరు కొట్టారు. టీచరేనా"

అవునని తలాడించింది రోహిణి.

"ఎందుకొట్టింది" కఠినంగా అడిగింది.

అమ్మలో కలిగే మార్పును గ్రహించి మౌనంగా నేలచూపులు చూస్తూ నిల్చుంది.

"హోం వర్క్ చెయ్యలేదనేనా"

మరింత కఠినంగా వున్నాయి అమ్మ మాటలు.

"సగం చేశానమ్మా" ఏడుస్తూ చెప్పింది.

"చెబితే విని చావవుగా, చదువు అంటే పుడుతుంది నీకు తెగులు. మొద్దు ముండవి పుట్టావుగదే నా ప్రాణానికి, నీకు చదువు రాదు. నీ బొందరాదు రోజూ ఇలాగే దెబ్బలు తిని చస్తావ్ ఇంక చదువు మానుకో, రంగమ్మని పన్లోనించి తీసేస్తాను. ఆ పనన్నా నేర్చుకుందువుగాని"

"నీకు చదువుకుందామనిలేదు. ఆయనకి ఓ అరగంట నీకు చదువు చెప్పాలనీ లేదూ" భర్త నుద్దేశించి విసుక్కున్నది లక్ష్మి.

అంతటితో అమ్మదండకం అయిపోతుందనుకున్న రోహిణి ఊహ తప్పయింది.

గౌను తొడిగేటప్పుడు, జడ అల్లేటప్పుడు, పౌడరు రాసే టప్పుడు తిడుతూనే వుంది.

తనకైతే ఇప్పుడు ఎదురింటి పిల్లలతో ఆడుకోవాలని వుంది. ఆ మాట అమ్మతో చెప్తే ఏంజరుగుతుందో తెలుసు తనకు. అందుకే మౌనంగా వుండిపోయింది.

అంతలో రానే వచ్చారు ఎదురింటి ఉమ, రమ, శీను ఆడు కోవడానికి. వాళ్ళని చూడగానే అంత భయంలోనూ ఆనందం కలి గింది రోహిణికి. ఎంత ఆపుకోవాలన్నా ఆగని ఆరాటం తనని వాళ్ళతో బయటికి పరుగెత్తించింది.

★ ★ ★

ఇంటికి వచ్చేసరికి కాస్త చీకటి పడింది. ఇల్లు ముఖం చూడ గానే భయం మొదలయింది అమ్మ చావగొడుతుంది ఏడుపు తన్ను కొస్తున్నది. అయినా తప్పదు ఇంటికి వెళ్ళాలి.

ఓసారి ఇలాగే ఆలస్యమయినందుకు భయపడి లోపలికి వెళ్ళకుండా వీధి అరుగుమీదనే కూర్చుంటే, తనను వెదకడం కోసం బయటికి వచ్చిన అమ్మ ఇంట్లోకి రాకుండా అక్కడ కూర్చున్నందుకు చావబాదడం రోహిణి మర్చిపోలేదు. అందుకే బిక్కు బిక్కుమంటూ ఇంట్లోకి వెళ్ళింది.

ఏదో నవల చదువుతూ వాలుకుర్చీలో పడుకున్న అమ్మ తననిగూర్చి పట్టించుకోలేదు చేతిలో ఏదైనా పుస్తకంవుంటే, అవతల ఎంత ముఖ్యమైనా సరే పట్టించుకోదు అమ్మ అనే విషయం తనకి బాగా తెలుసు, ఆ విషయంమీద అమ్మమ్మ చాలాసార్లు అమ్మని కోప్పడడం కూడా గుర్తుంది రోహిణికి.

పుస్తకాలు ముందేసుకొని కూర్చుంది, చదువుదామంటే కడుపులో ఆకలి. పైగా, తెల్లారితే మళ్ళీ దెబ్బల భయం. కాసేపు కూర్చోగానే కళ్ళు మూతలుపడుతున్నాయి అన్నంపెట్టమని అమ్మను అడగడానికి భయం భయానికి కారణం అమ్మచేతిలో పుస్తకం వుండడం.

కాసేపటికి అమ్మ నవల చదవడం పూర్తయింది. పుస్తకం మూసి గదిలోకి వెళ్ళింది. వచ్చేటప్పుడు ఒట్టి చేతులతో రాలేదు చేతులో విసనకర్ర బద్ద వుంది. అది చూడగానే రోహిణి పైప్రాణం పైకి పోయింది తెల్లారితే స్కూల్లో తన్నులు తినాలని భయపడుతున్న తను ఇప్పుడే అమ్మచేతిలో చావు దెబ్బలుంటాయని అనుకోలేదు. అయితే ఏం లాభం. కోపం వస్తే అమ్మ మనిషి కాదు. రాక్షసి, దెయ్యం, టీచరు.

క్రింద ఎవరితోనో మాట్లాడుతున్నారు నాన్నగారు ఏడుపు వినిపించినా పైకిరాలేదు. తను శోకాలు పెడుతుంది ఇంకెప్పుడూ ఆడుకోను, ఎక్కడికీ వెళ్ళనంటూ బ్రతిమాలుతోంది. అయినా అమ్మ కొడుతూనే వుంది. ప్రాణం వుంటుందా పోతుందా అన్న పరిస్థితిలో ఎలాగో అమ్మ కొట్టడం ఆపింది.

ఏడుపుతోనే అన్నం లేకుండా నిద్రపోయింది.

★ ★ ★

తెల్లారింది స్కూలు టైం అవుతున్నది. పాపం ఆపసిదానిలో క్షణక్షణానికి భయం పెరిగిపోతుంది. పోనీ బడికి పోనని మారాం చేస్తే అమ్మ ఊరుకోదు ఈడ్చుకు వెళ్తుంది. అక్కడ టీచరుకు అసలు విషయం చెబుతుంది అమ్మకి ఆ విషయం తెలీకూడదు, అందుకే తను బడికి వెళ్ళితీరాలి.

★ ★ ★

బిక్క మొఖంతో భయపడుతూ కూర్చున్న తనకి ఒక్కసారి బోలెడంత సంబరం కలిగింది. అందుకు కారణం ఏమంటే రోజూ తనని కొట్టే టీచర్ ఆరోజు రాలేదు. ఆ ఒక్కరోజూ కాదు ఇంకో మూడు రోజులుదాకా రాదట. స్వేచ్ఛగా గాలి పీల్చుకుంది ఆ చిన్ని ప్రాణం.

ఎంతో సరదాగా ఇంట్లోకి వచ్చింది. వస్తూనే అమ్మ మెడ చుట్టేసింది. నిన్నటి దెబ్బలన్నీ మర్చిపోయింది. ఇప్పుడు అమ్మ రాక్షసికాదు. అమ్మే. అందుకే అమ్మ దగ్గర అంత చనువుగా కూర్చోగలిగింది.

అమ్మ రోజూ ఇలాగే ఎందుకు వుండదో అనుకుంటూ కాసేపు కూర్చొని ఆడుకోవడానికి బయల్దేరింది నిన్నటివిషయం మర్చిపోయి.

ఇంటికి తిరిగివచ్చి కాసేపు చదువుకున్నది. అమ్మకి, నాన్న గారికి కాసేపు కబుర్లు చెప్పింది. నిద్రపోయింది.

* * *

మూడురోజులు సంతోషంగా గడిచాయి. మళ్ళీ రానేవచ్చింది ఆ టీచరు, తను భయపడుతున్నట్టే మళ్ళీ ఆరోజు చావబాదింది ఏడ్చింది, ఏడ్చింది. తనకి తానే ఓదార్చుకున్నట్టు. ఇక ఏడ్వడానికి ఓపిక లేనట్టు అలసిపోయి వూరుకుంది.

కాళ్ళీడ్చుకుంటూ ఇంటికి చేరింది.

అమ్మ హడావిడిగా పనిచేసుకుంటున్నది. గదిలో ఓ మూల ఓ సూట్‌కేసు, ఒక సంచి వున్నాయి

ఆ సూట్‌కేసు చూడగానే కనుక్కుంది. వాళ్ళింటికి ఎవరు వచ్చారో, అంతే టీచరు కొట్టిన దెబ్బలన్నీ ఎటుపోయాయో !

"అమ్మమ్మా, తాతయ్యా ఏరమ్మా" ఆత్రంగా అడిగింది.

"మామయ్యగారింటికి వెళ్ళారు. మళ్ళీ వచ్చేస్తారు ఇప్పుడే ఈలోగా నువ్వు నీళ్ళు పోసుకు రామ్మా. ఇవ్వాళ నాకు పనుంది గాని నువ్వే పోసుకురా" అన్నది అమ్మ.

అమ్మమ్మా వాళ్ళు వచ్చిన ఆనందానికి తోడు అమ్మ తననే నీళ్ళుపోసుకోమనడంతో ఇంకా సంతోషం అయింది. ఎందుకంటే, టీచరు కొట్టిన దెబ్బలు అమ్మచూడదు.

హుషారుగా స్నానం పూర్తిచేసి, అమ్మ కంటపడకుండా జాగ్రత్తపడి గౌను వేసుకుంది. ఆడుకోవడానికూ్కడా పోకుండా అమ్మమ్మకోసం ఎదురుచూస్తూ కూర్చుంది రోహిణి.

చాక్‌పీస్‌తో ఏదో నేలమీద రాసుకుంటున్న రోహిణికి నాన్న గారి మాటలు వినిపించాయి.

"ఏదీ రోహిణి వచ్చిందా, ఎక్కడుంది ?" కోపంగా అడుగు తున్నారు నాన్నగారు అమ్మని.

ఎందుకో నాన్నగారి కోపం అర్థం కాలేదు తనకి.

ఇంతలో తన దగ్గరికి రానే వచ్చాడు నాన్నగారు.

అంతే ఆయన రావడం, బెల్టు దెబ్బలు పడడం ఒకేసారి జరిగాయి. ఒణికిపోతున్నది పాపం ! ఆ పసిపిల్ల ఏడుస్తున్నది.

"ఏమిటండీ ఏమయింది" అనుకుంటూ బయటికి వచ్చింది అమ్మ. నాన్నగారి చేతిలో బెల్టులాక్కుంది.

సరిగ్గా అప్పుడే అమ్మమ్మ, తాతయ్య వచ్చారు వాళ్ళని చూడంగానే ఒక్కసారి ఏడుపు ఎక్కువయింది పరుగెత్తుకుంటూ వెళ్ళి అమ్మమ్మ కాళ్ళు చుట్టుకుంది. వెక్కి వెక్కి ఏడుస్తున్నది.

"అసలు ఆ పిల్లని బతకనిస్తారా లేదా మీరు. పిల్లని అట్లా కొట్టుకుంటారా" మందలింపుగా అని తనని సముదాయిస్తున్నది అమ్మమ్మ,

"ఏం చేసిందండీ అసలు" అడిగింది అమ్మ.

"ఏంచేయడం ఏమిటి ? రోజు స్కూల్లో ఫీజు తెమ్మని అడుగుతున్నారట. ఇవాళ వాళ్ళ టీచరు కనపడి చెప్పింది ఇన్నిరోజులు పంపకపోతే ఎలాగండీ అని అడిగింది వాళ్ళ ఫీజు అడుగుతున్నారని ఇంట్లో చెప్పక్కర్లా. ఆమె రోడ్డుమీద అడగడం నాకు ఎంత అసహ్యంగా వుంటుంది" చెప్పారు నాన్నగారు.

అమ్మ కళ్ళు ఎర్రబడ్డాయి. ఆవేశంతో ఊగిపోతున్నది. అంతే, రోహిణి గజగజ వణికిపోయింది. ఇక ఎంత దాచుకుందామన్నా ఆగ లేదు ఆ లేతమనసు.

అంతలోనే అమ్మమ్మ అడిగింది. "ఎందుకు చెప్పలేదమ్మా" అని లాలనగా.

అంతే మళ్ళీ ప్రవాహంలా తన్నుకొచ్చింది ఏడుపు.

"అది కాదమ్మమ్మా. నన్ను టీచర్ రోజూ కొడుతున్నది ఫీజు తీసుకురమ్మని, నేనేమో అమ్మకి హెూంవర్క్ చేయలేదని కొడుతున్న దని చెప్తున్నాను. ఎందుకంటే, ఫీజుకోసం అని చెప్తే అమ్మ నాన్న గార్ని అడుగుతుంది. నాన్నగారికి కోపం వస్తుంది. డబ్బుల్లేవూ అంటాడు. తర్వాత ఇద్దరూ పోట్లాడుకుంటారు. అప్పుడేమో నాన్న గారు అమ్మని కొడతారు మొన్నటిలాగే. అందుకే అలా అబద్ధం చెప్పాను. లేకపోతే నేను రోజూ హెూం వర్క్ చేస్తూనే వున్నా" అంటూ వలవల ఏడ్చింది.

అసలు విషయం ఏమంటే రోహిణిని కాన్వెంటులోనే చదివిం చాలని వాళ్ళ అమ్మ కోరిక.

"అనవసరంగా డబ్బు ఖర్చు తప్ప ప్రయోజనం వుండదు మామూలు స్కూల్లో చదివిద్దాం" అంటాడు వాళ్ళ నాన్నగారు.

ఈ అభిప్రాయ బేధంవల్ల చాలాసార్లు వాళ్ళు తీవ్రస్థాయిలో పోట్లాడుకున్నారు.

ఓ రోజు కూతురికి స్కూలు ఫీజు చెల్లించాలని చెప్పింది భర్తతో లక్ష్మి.

ఆరోజు అతని కెందుకో చికాగ్గావుంది, అందుచేత డబ్బు లివ్వనన్నాడు.

అప్పటికి ఆ ప్రసక్తి మానేసి మళ్ళీ ఎప్పుడో అడిగితే బాగుం దేమో కాని లక్ష్మి ఆ పని చేయలేదు.

ఫలితంగా ఇద్దరు మొండిగా వాదించుకున్నారు మాటామాటా పెరిగింది.

నిజానికి లక్ష్మి భర్తకి సహనం చాలా ఎక్కువనే చెప్పాలి అయినా, తన అమాయకత్వంవల్ల భర్త సహనానికి పరీక్ష పెట్టింది లక్ష్మి.

కోపం అణుచుకోలేని అతను లక్ష్మిపై చేసుకున్నాడు.

వాళ్ళు చేసిన పెద్ద పొరపాటు ఏమిటంటే, ఈ వాగ్యుద్ధం అంతా కూడా ఆ పసిపిల్ల ఎదురుగా జరపడం.

అప్పటినుంచి ఆ పసిహృదయలో భయం చోటుచేసుకుంది. "అమ్మని ఫీజు అడిగితే నాన్నగారిని అడుగుతుంది. నాన్నగారు అమ్మ పోట్లాడుకుంటారు." ఈ భయంతో అ చిన్నారి మనసు శిక్ష అనుభవిస్తున్నది పాపం.

(ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధం 1984 సెప్టెంబర్ 30)